క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ రొంపిచర్ల సమావేశం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సెంటర్‌లోని హైస్కూల్ పక్కన అంకమ్మతల్లి దేవాలయం దగ్గర శనివారం ఉదయం 10గంటలకు వైఎస్సార్‌సీపీ రొంపిచర్ల మండల నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు.బాబుష్యూరిటీ–మోసంగ్యారంటీ కార్యక్రమంపై చర్చించటం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ భారీగా ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

21న నూజెండ్ల మండల పరిషత్ సమావేశం

నూజెండ్ల: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.ఉమాదేవి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశ మందిరంలో కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో తెలపారు.

ఎముకల సాంద్రతపై వైద్యశిబిరం



నరసరావుపేట ఈస్ట్: చిన్నతనం నుంచే ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ ఫర్హానా పర్వీన్ తెలిపారు. గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఫర్హాన హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎముకల సాంద్రత పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఫర్హానా పర్వీన్ మాట్లాడుతూ బాలికలకు యుక్త వయస్సులో వచ్చే ఋతుక్రమంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్య దశలో తలెత్తే అనారోగ్య సమస్యలకు ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ పాల్గొన్నారు.

తపాలా ఏజెంట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట టౌన్: నరసరావుపేట పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలకు ఏజెంట్లుగా పనిచేసేందుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్ అర్హత కల్గిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ డివిజన్ సూపరింటెంట్ మహమద్ జాఫర్ సాధిక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు స్థానిక హెడ్‌పోస్టాఫీసులో ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని కోరారు. ఎన్నికైన అభ్యర్థులు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌ను ఎన్ఎస్‌సీ బాండ్స్ రూరంలో పూచీకత్తు సమర్పించాలన్నారు. వివరాలకు 08647–222244, 9494642465 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గడ్డి మందు తాగి వివాహిత బలవన్మరణం



నాదెండ్ల: క్షణికావేశంలో వివాహిత గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడి చికిత్స పొందు తూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు జంగాలపల్లె గ్రామానికి చెందిన కొల్లి పార్వతి (25) ఐదేళ్ళ క్రితం తూబాడు గ్రామానికి చెందిన పోలురాజుతో వివాహమైంది. వీరికి ఇరువురు మగసంతానం. కొద్దిరోజుల క్రితం ఒక కుమారుడికి జ్వరం రావడంతో మందులు వినియోగిస్తున్నారు. కుమారుడికి సకాలంలో మందులు వేయటం లేదంటూ పార్వతిపై భర్త పోలురాజు కోప్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన గురువారం పార్వతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలానికి వినియోగించే గడ్డిమందు తాగింది. గమనించిన పోలురాజు భార్య పార్వతిని తన ద్విచక్రవాహనంపై నరసరావుపేట మహాత్మాగాంధీ ఆసుపత్రిలో చేర్పించాడు. శుక్రవారం ఉదయం ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై పార్వతి తండ్రి మొక్కల వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోషకాహార ప్యాకెట్లు పంపిణీ

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి మురళీ కృష్ణ ఆదేశాల మేరకు టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాయిబాబా, సి.హెచ్.ఓ. రమణమూర్తి, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య పాల్గొన్నారు.

కేబీఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌కు..

పార్కింగ్ సమస్య

- విచ్చలవిడిగా బయట వ్యక్తులు వాహనాల పార్కింగ్
- కాంప్లెక్స్‌లోకి వచ్చేందుకు వెనుకాడుతున్న వినియోగదారులు
- వ్యాపారాలు లేక ఇక్కట్లు
- అక్కడ పార్కింగ్ క్రమబద్ధీకరణ మాపని కాదంటున్న మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు



కేబీఆర్ షాపింగ్ కాంప్లెక్స్, ఎదురుగా ద్విచక్రవాహనాలు



ఖాళీగా ఉన్న షాపులో మున్సిపల్ సిబ్బంది బ్లీచింగ్ నిల్వచేయటంతో తుప్పపట్టిన షట్టర్

నరసరావుపేట: పట్టణంలోని స్టేషన్‌రోడ్డులోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) కాంప్లెక్స్‌లోని షాపుదారులకు వాహనాల పార్కింగ్ సమస్య రాచపుండులా వేధిస్తుంది. షాపులలో పనిఉన్నవారితో పాటు పనిలేని వారు సైతం తమ వాహనాలను కాంప్లెక్స్ ఆవరణలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండటంతో వినియోగదారులు షాపులకు రాక సరిగ్గా బేరాలు జరగక వ్యాపారులు అల్లాడుతున్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవటంతో పార్కింగ్ సమస్య వ్యాపారులను వెంటాడుతోంది.

2011లో ఆరంభమై....

ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం టౌన్స్ (ఐడీఎస్ఎంటి) పథకం కింద మంజూరైన రూ.1.42 కోట్ల నిధులతో స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురుగా పాత మార్కెట్ స్థలంలో 105 షాపులతో పురపాలకశాఖ నిర్మించిన కేబీఆర్ కాంప్లెక్స్‌ను 2011 ఫిబ్రవరి 27వ తేదీన అప్పటి మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. షాపులలో కొన్నింటిని ఎస్సీ, ఎస్టీలకు కేటాయించి ఒక్కోషాపును వేలం వేయగా రూ.10 లక్షల నుంచి రూ.36 లక్షల వరకు ఔత్సాహికులు పాడుకొని స్వాధీనం చేసుకున్నారు. కాంప్లెక్స్ నిర్మించేందుకు పురపాలక శాఖకు సుమారు రూ.1.5 కోట్ల ఖర్చు అయితే వేలం ద్వారా సుమారు రూ.6 కోట్లు రెవెన్యూ చేకూరింది.

35 షాపుల వరకు ఖాళీగా..

అయితే దీనిలోని 22 షాపులను పాత మార్కెట్‌లో వ్యాపారాలు చేస్తున్న వారికి రిజర్వ్ చేసి వాటికి వేలం నిర్వహించ లేదు. మొత్తం షాపుల్లో ఇప్పుడు 35 షాపుల వరకు ఖాళీగా ఉండగా మిగతా వాటిల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాటిపై పన్నులను ప్రతి ఏటా పురపాలక సంఘం వ్యాపారుల నుంచి వసూలు చేస్తుంది. తొలుత కాంప్లెక్స్ నిర్వహణకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. అందరూ కలిసి కొంత మొత్తం ప్రతి నెలా వసూలు చేసి కొంతకాలం కాంప్లెక్స్ పరిశుభ్రత, పార్కింగ్ నిర్వహణ, రాత్రిపూట భద్రతకు వాచ్‌మెన్ లాంటి మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. షాపుల వారు సక్రమంగా తాము చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకపోవటంతో నిర్వహణ భారమై పర్యవేక్షణ కుంటుపడింది. దీంతో సమస్య తలెత్తింది.

ఇష్టానుసారంగా పార్కింగ్

ఎప్పుడూ రద్దీగా ఉండే స్టేషన్ రోడ్డులో కాంప్లెక్స్ ఉండటంతో జనాల తాకిడి అధికంగా ఉంటుంది. కాంప్లెక్స్ ముందు ఆవరణ పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. దీనిలో షాపులలో కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులతో పాటు కాలక్షేపానికి వచ్చేవారు, ఇతర పనులపై వచ్చిన వారు ఈ ప్రదేశంలోనే తమ ద్విచక్ర వాహనాలను ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. కొంతకాలం ఒక వ్యక్తిని ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధీకరించే పనిచేయగా అతనిపై వాహనదారులు వాదనకు దిగి దాడికి దిగుతుండటం ఆ పని విరమించుకున్నారు. దీంతో ఎవరిష్టం వచ్చినట్లుగా వారు పార్కింగ్ చేసి వెళుతున్నారు.

వాణిజ్య కాంప్లెక్స్ కావడంతో అక్కడి ట్రాఫిక్‌ను పోలీసులు పట్టించుకోవట్లేదు. ప్రతి ఏడాది పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు పరిశుభ్రత మినహాయించి ఆ సమస్యను మీరే పరిష్కరించుకోవాలని షాపు యజమానులకు తెలియచేశారని కొంతమంది వ్యాపారులు వాపోతున్నారు.

పశువులు, బిచ్చగాళ్లకు ఆవాసం!

అలాగే ఆవులు, కుక్కలు విచ్చలవిడిగా ఆ ప్రదేశానికి వచ్చి మలమూత్రాలు విసర్జిస్తున్నాయి. బిచ్చగాళ్లు, ఇల్లు, వాకిలీ లేని ఆవారాలు ఖాళీగా ఉన్న షాపులు, కాంప్లెక్స్ వరండాలను ఆక్రమించి గంజాయి సేవిస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమౌతున్నారు. గత కొన్నేళ్లుగా ఉన్న ఈ సమస్యను ప్రజాప్రతినిధులు పట్టించుకొని తమ సమస్యను తీర్చాలని వ్యాపారులు కోరుతున్నారు.

‘విలీన’ వ్యవహారం న్యాయస్థానం విచారణలో ఉంది



మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

- ఈ అంశాన్ని ఎజెండాలో ఎలా పొందుపరుస్తారు?
- విలీన గ్రామాల డీనోటిఫై అంశాన్ని వ్యతిరేకించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- డీసెంట్ నోట్ అందజేత

చిలకలూరిపేట: ఉన్నత స్థానంలో విచారణలో ఉన్న అంశాన్ని మున్సిపల్ ఎజెండాలో ఎలా పొందుపరుస్తారని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండా చదవడం పూర్తి అయ్యాక వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎజెండాలో రెండో అంశంగా పురపాలక సంఘంలో విలీనమైన మానుకొండవారిపాలెం, పసుమర్రు, గణపవరంలను డీనోటిఫై చేసేందుకు పొందుపరచటాన్ని తప్పుబట్టారు. ఎప్పుడో మూడు గ్రామాలకు సంబంధించి పంచాయతీ తీర్మానాలు చేసి విలీన ప్రక్రియ మున్సిపల్ శాఖ ద్వారా చేయడం జరిగిందన్నారు.

మున్సిపాలిటీ గ్రేడ్ పెరిగితే కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరై అభివృద్ధికి ఎక్కువ అవకాశం ఉంటుందన్న నేపథ్యంలో గ్రామాలు గత ప్రభుత్వ హయాంలో విలీనం చేయడం జరిగిందన్నారు. ఉదాహరణకు ఒక్క గణపవరం గ్రామంలోనే 25 వేలకు పైబడి జనాభా నివసిస్తున్నారని, పరిశ్రములు వాటి క్వార్టర్స్‌లో మరో 20వేలకు పైబడి కార్మికులు నివిస్తున్నారని వెల్లడించారు. వీళ్ల అవసరాలను పంచాయితీ తీర్చే పరిస్థితిలో లేదని వివరించారు. 40 ఏళ్ల నాడు తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్‌బెడ్‌లు, ఓవర్‌హెడ్‌ట్యాంక్ మరమ్మతులకే 35 లక్షలు పెట్టాల్సి వచ్చిందన్నారు. ఇక మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 25 నుంచి 30 కోట్లు అవసరమౌతాయని వెల్లడించారు. ఇంతగా నిధులు కావాలంటే సంబంధిత గ్రామాలు పురపాలక సంఘంలో ఉంటే మాత్రమే అభివృద్ధి చెందుతాయని వివరించారు. గ్రామాలు విలీనం చేశాక కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నప్పటికీ మున్సిపల్ శాఖ అధికారులు అదే కోర్టుకు వెళ్లి విలీన గ్రామాలతో కలిపి ఎన్నికలు నిర్వహించుకునేలా ఉత్తర్వులు తెచ్చుకొని ఎన్నికలు నిర్వహించారని వెల్లడించారు. ఇప్పుడు ప్రభుత్వం మారాక తిరిగి విలీన గ్రామాలను డీ నోటిఫై ఎలా చేస్తారని ప్రశ్నించారు.

ఇంప్లీడ్ అయ్యాం

విలీన గ్రామాలకు సంబంధించి హైకోర్టులో ఉన్న వాజ్యంలో తాము కూడా ఇంప్లీడ్ అయ్యామని వెంకటేశ్వరరావు తెలిపారు. విలీన గ్రామాల్లో అభివృద్ధి చేయమంటే కోర్టు ఉత్తర్వులు అడ్డుగా ఉన్నాయని చెప్పే మున్సిపల్ అధికారులు, విలీన గ్రామాలను డీనోటిఫై చేసేందుకు ఎజెండాలో ఎలా పొందుపరుస్తారని నిలదీశారు. దీనికి మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మాట్లాడుతూ కేవలం డీ నోటిఫై చేసేందుకు మాత్రమే ఎజెండాలో పొందుపరిచామని, నిర్ణయం అనేది కోర్టు ఉత్తర్వులపైనే ఆధారపడి ఉంటుందని వివరించారు. వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు అధికారులతో మాట్లాడుతున్న సమయంలో వైఎస్సార్ సీపీ తరుపున గెలుపొంది టీడీపీలోకి ఫిరాయించిన కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, బేరింగ్ మౌలాలి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు తెలిపి సమావేశం ముగించారు.

డీసెంట్ నోట్ అందజేత..

మున్సిపల్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను కలసి డీసెంట్ నోట్‌ను అందజేశారు. ఎజెండాలోని రెండో అంశమైన విలీన గ్రామాల డీ నోటిఫైను తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తులం సుధాకర్, యడ్ల ఇందిరా, షేక్ అదాంబి, షేక్ మస్తాన్‌వలి, వి.కోట్యానాయక్, షేక్ మీరాబి, షేక్ కరిముల్లా, కె.రమణిబాయి, కె.విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

21 నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 188వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని యోగ గురూజీ కూనిశెట్టి వెంకట జనార్ధనరావు శుక్రవారం తెలిపారు. శ్రీపట్టాభి రామ స్వామి ఆలయంలోని శ్రీవేంకటేశ్వర కల్యాణమండపంలో 28 రోజుల పాటు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ శిబిరంలో 42 యోగ భంగిమలు, ఆహార నియమాలు, ధ్యానం, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు బోధించనున్నట్లు వివరించారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

చెరువులోకి దిగి వృద్ధురాలు మృతి

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మీకాంతమ్మ (70) గ్రామం పరిధిలోని చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు మృత్యువాత పడింది. స్థానికు ల కథనం ప్రకారం... గ్రామంలోని తాగునీటి చెరువులో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు దిగి కాలుజారి నీటి మునగడంతో ఈ ప్రమాదం నెలకొంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం నుంచి బయటకు తీసే అవకాశం లేకుండా పోయిందని, సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన వెళ్లి ఆమె మృతదేహాన్ని వెలికితీశారని చెబుతున్నారు. అనంతరం గ్రామంలోనే అంత్యక్రియల నిర్వహణ పూర్తి చేశారు. అయితే ఆమెకు మతిస్థిమితం లేని కారణంగా ఇలా ప్రమా దం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

రొంపిచర్ల: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు హోమ్ నీడ్స్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సిఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.వి.రమణ, సోమశేఖర్ పాల్గొన్నారు.

జగదంబకు ఆషాఢ పూజలు



శావల్యాపురంలో సారెను అందజేస్తున్న భక్తులు



నరసరావుపేటలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ప్రకాష్‌నగర్ సాయి క్షేత్రంలో వేంచేసి ఉన్న గాయత్రీ అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. దేవస్థానం చైర్మన్ మురారిశెట్టి గోపాలబాబు ఆధ్వర్యంలో శుక్రవారం 58 మంది మహిళలు పండ్లు, పూలు, పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు తదితర సారె సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని సారె సమర్పించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని అమ్మవారికి సారె మిఠాయిలు, పూలు, సమర్పించి తమ మొక్కులు శుక్రవారం తీర్చుకున్నారు. ఆలయ పూజారి సాయి భరత్ సారథ్యంలో అర్చనలు అభిషేకాలు విశేష పూజలు ఘనంగా నిర్వహించారు.

గణపవరంలో...



గణపవరంలో శాకాంబరిగా..

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న గణపతి, వాసవీ కన్యకాపరమేశ్వరీ సహిత కోదండరామాలయంలో శుక్రవారం అమ్మవారికి ఆషాడ మాస సందర్భంగా విశేషఅలంకరణ నిర్వహించారు. శాకాంబరిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

స్టార్టప్‌లపై యువత దృష్టి సారించాలి



నరసరావుపేట రూరల్: యువత ఉద్యోగాలు వేతకకుండా ఉపాధి అవకాశాలు సృష్టించే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని విజ్ఞాన్ టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యుబేటర్ సంస్థ మేనేజర్ అబ్దుల్ రియాజ్ తెలిపారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటర్ ప్రెన్యూయర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంకేతికతను ఆధారంగా చేసుకొని స్టార్టప్‌లు ప్రారంభించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీం మొహిద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు ‘కూటమి’ అన్యాయం చేస్తోంది

- రాష్ట్రంలో ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కనీసం పంటలకు మద్దతు ధరను కల్పించలేని ప్రభుత్వం ఉందని మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం తన స్వగృహంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో పచ్చగా కనిపించే పల్లెలు, నేడు మద్యం ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయని, రైతులు పండించిన మిర్చి, పొగాకు పంటలతో పాటు, వరి, కంది, శనగ వంటి పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ జరిగిందని, ప్రస్తుతం రేషన్ మాఫియా పేదల బియ్యాన్ని ఆదాయవనరుగా ఉపయోగించుకుని యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటున్నారని దుయ్యబట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తోందని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వినుకొండను మాఫియాకు అడ్డాగా జీవీ ఆంజనేయులు హయాంలో తయారైందన్నారు. కేబినెట్ హోదా పదవిని దక్కించుకున్న జి.వి.ఆంజనేయులు వినుకొండను బాగా అభివృద్ధి చేస్తారని ప్రజలు అనుకుంటే దానికి భిన్నంగా గతంలో వేసిన శిలాఫలకాలు ధ్వంసం చేసి తమపేర్లు వేయడం తప్ప చేసిందేమీలేదన్నారు. వినుకొండలో ఆసుపత్రి కడితే బ్రహ్మనాయుడు గారికి పేరు వస్తుందనే ఉద్దేశంతో ఆసుపత్రికి అన్ని అనుమతులు వచ్చినా కట్టకుండా నిలిపేశారన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని రోజులు ఎప్పటిలాగా ఉండవని గుర్తు ఉంచుకోవాలని హెచ్చరించారు.

కేటగిరీల వారీగా జీతాలు చెల్లించాలి

ఆర్డీఓ కార్యాలయం వరకు నాయకులు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ర్యాలీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కేటగిరీల వారీగా జీతాలు పెంపుదల అమలు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో ఆరో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. తొలుత సమ్మెలో ఉన్న కార్మికులను ఉద్దేశించి జిల్లా కోశాధికారి డి.శివకుమారి మాట్లాడుతూ జీవో నంబరు 36ను అనుసరించి కార్మికులకు రూ.21 వేలు, రూ.24,500లు జీతాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గతంలో విడుదలైన జీఓలను అనుసరించి ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్‌సీ జీతాలు, కరువు భత్యం, టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు అమలు చేయాలన్నారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక ఒప్పందం మేరకు 2019 జనవరి నుంచి అమలు చేస్తామన్న సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలైన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా పెంపుదల, దహన సంస్కారాలకు రూ.20 వేలు చెల్లింపు, ఎటువంటి షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు కోసం జీఓలు జారీ చేయాలని కోరారు. చనిపోయిన, అనారోగ్యంపాలైన వారి కుటుంబాలలోని పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, ఆప్కాస్‌లోని వారందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచి చట్టబద్ధమైన సెలవులు, కిట్లు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 12 వేల మంది ఇంజనీరింగ్ కార్మికులకు తమ నైపుణ్యానికి తగిన జీతాలు లభించకపోవటంతో పెరిగిన నిత్యావసరాల ధరల వలన వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల డిమాండ్లను ఆమోదించి సమ్మెతో ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలను తొలగించాలని కోరారు. దీనిలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, బండారుపల్లి నాగేశ్వరావు, లక్ష్మారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, షేక్ చిన్న అల్లా బక్షు, సోమశేఖరు, కుంచాల శ్రీనివాసరావు, బాలాజీ సింగ్, షకీలా శ్రీను నాయకత్వం వహించారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎన్నిక



గ్రామకమిటీల నియామక పత్రాలు అందిస్తున్న నారాయణరెడ్డి

బొల్లాపల్లి: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ కె.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు13 గ్రామాల్లో పూర్తిచేసినట్లు తెలిపారు. శుక్రవారం వెల్లటూరు పేరూరుపాడు నాయుడుపాలెం గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఆయా గ్రామ కమిటీలు గ్రామాల్లో పార్టీ పటిష్టతతో పాటు కార్యకర్తల సమస్యలను మండల స్థాయి దృష్టికి తీసుకురావాలని ఎప్పటికప్పుడు పార్టీ ఆదేశాలను అమలు చేయాలని సూచించారు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కలిసికట్టుగా పోరాటానికి ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీల ఎంపికలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఖజ్జాయం లక్ష్మీనారాయణ డి.గోవిందు నాయక్ బత్తి గురవయ్య, ఎ.లింగరాజు, ఎం.వెంకటేశ్వర్లు. పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలుకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు కోరబడుతున్నట్లు రాష్ట్ర సమన్వయకర్త రవీంద్రనాథ్, జిల్లా సమన్వ యకర్త హుస్సేన్‌లు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికై నట్లు చెప్పారు. ఓపెన్ స్కూలులో చదివేందుకు 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుతున్నాయని, ఈ నెల 31తో గడువు ముగియనుందన్నారు. ప్రవేశానికి అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.100లు, అడ్మీషన్ ఫీజు రూ.1300లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 14 ఏళ్ళు నిండిన వారు పదో తరగతి ప్రవేశానికి, 15 ఏళ్ళు నిండి పదో తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్‌కు దర ఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సరళమైన సార్వత్రిక విద్యావిధానంలో ఏడాదికి 30 ఆదివారాలు తరగతులు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణారెడ్డి, హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పిచికలపాలెం వాసి దుర్మరణం

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారి మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు ఒరిస్సా రాష్ట్రం నుంచి నరసరావుపేట నుంచి గిద్దలూరు వైపు వెళుతున్న షిఫ్ట్ డిజైర్ కారు బయలుదేరింది. ఈక్రమంలో మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన తిరివిధి రత్తయ్య (49) రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలో తన బంధువుల ఇంటికి వెళ్ళి బైకుపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో శావల్యాపురం మండలం కృష్ణాపురం గ్రామం సమీపంలో జాతీయ రహదారి మార్గంలో వెనుక నుంచి అతివేగంతో కారు, బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో మృతుడు రత్తయ్య తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య కుమార్తె కలరు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.